


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 117 -

## ఎడారి గొర్రె

"ఒరేయ్ రాముా.. దూరంగా పోవద్దురా నాయనా.. మందను విడిచిపోతే పులి వచ్చి తినేస్తాదిరా బాబూ" అంటూ కేకేసాడు ఎంకటేసు.

అతడి మాట చెవిన పడగానే వెనుతిరిగి గునగునా నడుచుకుంటూ దగ్గరకొచ్చి గోముగా కాళ్ళ మీద తల వాల్చింది రాము.

దాని తలమీద చెయ్యేసి నిమురుతూ "నా కొడకా నేనంటే ఎంత ప్రేమరా నీకు" అంటూ బిగ్గరగా నవ్వాడు ఎంకటేసు.

చుట్టూ నాలుగుదిక్కులా నిండుకున్న ఎడారి.. కనుచూపు మేరా విశాలంగా పెద్ద పరుపులా పరుచుకుని వుంది. రా రమ్మని బాహువులు చాచి ఆహ్వానిస్తోంది.

కొయేటు వచ్చి ఆరేళ్ళయింది. వచ్చినరోజే సేటు తెచ్చి ఎడారిలో ఈ గొర్రెల దగ్గర వదిలాడు. గొర్రెలను జాగ్రత్తగా చూసుకోమన్నాడు. మొదట్లో ఎడారిని చూసి భయంతో ప్రాణం బితుకుబితుకుమనేది.

ఎప్పటికప్పుడు వెళ్ళిపోదామనుకుంటున్నాడు కానీ ఇంటికాడ అవసరాలు పెరుగుతున్నాయే కానీ తరగడం లేదు. వచ్చిన కొత్తలో పెళ్ళాం రాసే ఉత్తరాల్లో తనపై ప్రేమ కనిపించేది. తరువాత తను పంపించే దినారాలపై ప్రేమ పెరిగిందనేది వాస్తవము. అంతే మరి. డబ్బు ప్రేమను చంపేస్తోంది.

"ఒంటరిగా ఈ ఎడారిలో వుండలేనే మునిలచ్చిమీ.. వచ్చేస్తానే" అని జాబు రాస్తే..

"ఇంకో రెండేళ్ళు ఓపిక పట్టు సామీ మన కష్టాలు తీరిపోతాయి" అంటూ జవాబు రాసింది.

ఈ జన్మకు పెళ్ళాం బిడ్డల్ని చూసే ప్రాప్తం వుందో లేదో.. చూడకుండానే ఏదో ఒకరోజు ఇక్కడే ఈ ఇసుకలోనే సమాధి అయిపోతాడేమో..!

ఊరు, ఇల్లు, పొలమూ, పిల్లలూ గుర్తొస్తే గుండె నీరవుతోంది. ఈ క్షణమే రెక్కలు కట్టుకుని ఎగిరి ఇండియాకు పోదామనిపిస్తోంది. పగలంతా సెగలతో మండే ఈ ఎడారి సాయంత్రమయితే చలితో చంపేస్తోంది.

వెచ్చగా భార్య పక్కలో పడుకుంటే ఆహా.. స్వర్గం కనపడతాది కదా. ఆ అదృష్టం ఎప్పుడో..

"బాబా.. ఒకసారి ఇంటికి పోయి వస్తా" అని సేటును అడుగుతూనే వున్నాడు.

ఆయన.. "నువ్వు పోతే మరలా తిరిగి రాలేవు ఎంకటేసూ.. నాకు తెలుసు. రేపు సంవత్సరం పంపిస్తాలే" అంటాడు. అలాగే ఆరేళ్ళు గడిచిపోయాయి.

సేటు నిజంగా దేవుడే. ఇప్పటివరకూ ఏ కొరతా చెయ్యలేదు. కానీ ఆయన స్వార్థం ఆయనది. గొర్రెలను కాయడానికి మరో మనిషి దొరకాలి కదా. తాతల కాలం నుండీ గొర్రెల వ్యాపారం చేసే మనిషి సేటు.

కానీ జన సంచారం లేని ఎడారి జీవితం విసుగు పుడుతోంది. మనిషి మాటకు మొహం వాచి పోతున్నాడు. తోడు కోసం పిచ్చివాడవుతున్నాడు. ఎంత ఏడ్చినా ఏం లాభం. బతుకంతే. ఇప్పుడు తన రూపం కూడా మారిపోయింది. జుట్టు తెల్లబడిపోయింది. వళ్ళంతా మాసిపోయింది. ఎడారి మనిషిలా మారిపోయాడు. ఇలా ఇంటికి వెళితే భార్య గుర్తు పడతాదో లేదో. దానికి మొగుడి కంటే దినారాలు ముఖ్యం. ప్చ్.

"ఏహేయ్.. జయప్రదా.. నీయమ్మ ఎక్కడికి పోతున్నావే.. ఆరేసుకోబోయి పారేసుకున్నాను హరీ అంటూ ఆ రామారావు దగ్గరికి పోతున్నావా? ఇటు రావే నా వగలాడీ" అంటూ గట్టిగా అరిచాడు. బలిసిన గొర్రె ఒకటి మాట వినిపించుకోకుండా దూరంగా పోతాంది.

"హేయ్ దా.. దా.." అంటూ కర్ర పట్టుకుని ఆ గొర్రెను తోలుకొచ్చాడు. దాని పిల్ల కూడా తల్లి దగ్గరికి వచ్చి నిలబడింది.

ఇంటికాడ వున్న తన పిల్లోళ్ళు గుర్తొచ్చారు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇప్పుడు పిల్లోళ్ళు పెద్దోళ్ళయ్యారు. ఇంతకీ భార్య మునిలక్ష్మి తను లేకుండా ఎలా వుందో ఏమో? మొగుడు లేకుండా ఒంటరిగా ఆరేళ్ళు వుండగలదా? అందంగా వుంటాదని మగోళ్ళ కళ్ళన్నీ ఆయమ్మి పైనే వుండేవి.

ఉప్పు కారం తినే శరీరం ఇప్పటికి ఎవడి పక్కకో చేరి కొంగు పరవలేదు కదా! చేదు తిన్నట్లు బాధగా తల విదిలించాడు.

ఉహూ.. లేదులే ఆయమ్మి నిప్పు. అలాంటి పనులు చెయ్యదు. కష్టమైనా సుఖమైనా తనతోనే నడుస్తాదనే నమ్మకంతోనే ఇంతదూరం కొయేటికి వచ్చాడు. తను ఆరేళ్ళుగా ఇక్కడ ఒంటరిగా వుండటం లేదా. ఈ ఎడారిలో ఎన్ని అగచాట్లు పడుతున్నాడో కదా.

నరుడు కనిపించని నేల ఇది. మాటలు, పాటలు, ఆటలు, ప్రేమలు అన్నీ ఈ గొర్రెలతోనే. సేటు ఏ వారానికో వచ్చి అన్నీ ఇచ్చి గొర్రెలను చూసి వెళ్ళిపోతాడు.

అంతే. తరువాత అంతా నిశ్శబ్దం. రాత్రింబగళ్ళూ ఎడారి హోరు చెవిలో గింగురుమంటుంది. ఇదే తన జీవితం. ఎడారికే బతుకు అంకితం.

"ఆ డబ్బు వద్దు ఏమీ వద్దు. నువ్వు ఇంటికి రా సామీ. కూలోనాలో చేసుకుని కలోగంజో తాగి బతుకుదాం. నువ్వు నా దగ్గరుంటే చాలు అదే పదివేలు" అని భార్య ఒక్కమాట అంటే మనసుకు తృప్తిగా సంతోషంగా వుంటుందేమో.

ఏదో బాధ. ఎక్కడో లోటు. తను డబ్బు సంపాదించే యంత్రం అయ్యాడా? ఎందుకో ఏడుపు వస్తోంది.

తలను చేతుల్లో దాచుకుని కాసేపు వెక్కివెక్కి ఏడ్చాడు. ఎడారి పొద్దు బిరబిరా పడమటికి వాలుతోంది. చీకటి పడితే పాములు, తేళ్ళు బిలబిలా బయటికొస్తాయి. వాటిని తప్పించుకోవడం కష్టం.

ఏదో రాత బాగుండబట్టి ఇన్నేళ్ళూ బతికి బట్ట కట్టాడు. ఆలోచిస్తూ గొర్రెలన్నిటినీ షెడ్డులోపలికి తోలాడు ఎంకటేసు.

సంధ్యవేళ సూర్యుని కిరణాలు పడి ఇసుక గుట్టలు ధగధగా బంగారంలా మెరిసి పోతున్నాయి. ఎడారి దుమ్ములా ఆలోచన మరలా కమ్ముకుంది. బతుకు ఈ ఎడారిలో ఎండి కృంగిపోయింది. జీవం లేని మనిషైపోయాడు. నెలనెలా వచ్చే జీతంకోసం ఈ ఎడారిని భరించక తప్పదు. ఇంటి దగ్గర ఎదిగిన పిల్ల పెళ్ళి చెయ్యాలంటే, పిల్లోడు బాగా చదువుకోవాలంటే, ఇల్లు గడవాలంటే డబ్బు కావాలి.

అక్కడ ఇండియాలో తన వాళ్ళు సుఖంగా, సంతోషంగా వుండాలంటే తను ఇక్కడ కష్టం చెయ్యక తప్పదు మరి.

మూడుపూటలా తిని పెళ్ళాం పక్కన వెచ్చగా పడుకోవాలంటే తను మారాజు కాదు కదా. అక్కడ ఇంటికాడ రెక్కలు ముక్కలు చేసుకుని పొలం పని చేస్తే ఇల్లు గడవడం కష్టమవుతోంది.

పొట్టకూటి కోసం ఇంతదూరం సముద్రాలు దాటుకుని కొయేటుకు వచ్చినప్పుడు ఎడారి అయినా, ఎంత కష్టమయినా సరే నిలబడాల.

సుఖంగా వుంటేనే పని చేస్తా అంటే పరదేశంలో కుదరదు కదా. అప్పులు తీరి కుటుంబం కుదుట పడాలంటే డబ్బు సంపాదించడమే ముఖ్యం.

కూర్చుని ఆలోచనలో పడి గొర్రెలకు నీళ్ళు పెట్టడం మర్చిపోయాడు. నోరులేని మూగజీవాలు పాపం. వెళ్ళి వాటికి నీళ్ళు పెట్టాడు. వాటితో తన బాధను చెప్పుకున్నాడు. ఇక్కడ ఈ ఎడారిలో ఎవరూ లేరనే దిగులెందుకు? ఈ గొర్రెలు జీవాలు కాదా!

ఇవి ప్రేమించినట్లు మనుషులు మనల్ని ప్రేమిస్తారా? మొగుడి బాధను పట్టించుకోని పెళ్ళాం కంటే ఇవే నయం. నవ్వుకున్నాడు.

అలవాటయ్యాక వాటి భాష కూడా అర్థం అవుతోంది. అవి వచ్చి బిడ్డల మాదిరి ఒడిలో పడుకుని గారాలు పోతుంటే, మారాం చేస్తుంటే కుశాలగా వుంటాది.

వాటిని మేపుతూ, ఆలనా పాలనా చూస్తూ భార్యా బిడ్డల ధ్యాస కాస్త మర్చిపోతున్నాడు ఎంకటేసు.

ఈ ఎడారే ఇల్లయింది. గొర్రెలే బిడ్డలయ్యాయి. ఇదే తన ప్రపంచం. ఇంకెన్నేళ్ళకో ఇంటికి వెళ్ళేది. అది ఎప్పుడో చెప్పలేకున్నాడు. పిల్లోడు చదువుకుని ఉద్యోగం తెచ్చుకునేటప్పటికి ఇంకో పదేళ్ళు పట్టచ్చు. అంతవరకూ ఈ ప్రాణం వుంటుందా? ఈ లోపల ఒక్కసారి పోయి రావాల.

ఎంత సర్ది చెప్పుకున్నా మనసును ఎంత సముదాయించినా ఇంటిమీద ఊరి మీద గుబులు తగ్గేది కాదు.

ఈసారి సేటు వచ్చాడంటే ఇంటికి పోయి వస్తానని గట్టిగా అడగాలి. పుట్టే గొర్రెలు కొన్ని.. గిట్టే గొర్రెలు కొన్ని.

వచ్చినప్పుడల్లా సేటు పది గొర్రెలను పట్టకపోయి అమ్ముకుంటాడు. ఆయనా బతకాలి, తనకు నెలనెలా జీతం ఇవ్వాలి. ఇదే కదా జీవితం.

ఏ మాటకు ఆ మాటే చెప్పాలి సేటు చాలా మంచివాడు. దేనికీ తక్కువ చెయ్యడు. జీతం కరక్టుగా ఆయనే ఇంటికి పంపిస్తాడు. ఇంటికాడి జాబులను తెచ్చి ఇస్తాడు. అందులో డబ్బు చేరిందని, అవసరాలు తీరాయని ఇంట్లో వాళ్ళు రాస్తారు. అంతకుమించి నువ్వు ఎలా వున్నావు? ఏం బాధలు పడుతున్నావు? కష్టంగా వుందా? అనే ఆదుర్దా ఏమీ కనిపించదు.

డబ్బు అందుకోవడంలోని ఆనందం వాళ్ళకి అలవాటయిపోయింది. ఏం చెప్పగలడు? నిస్సారంగా, నిస్తేజంగా సాగుతోంది ఈ ఎడారి పయనమని ఎవరికి చెప్పగలడు?

స్టవ్ వెలిగించి రెండు రొట్టెలు వేడి చేసుకున్నాడు. పెనంపై నూనె వేసి రెండు గుడ్లు కొట్టి పోసి ఆమ్లెట్ చేసుకున్నాడు. కూచుని తృప్తిగా తిన్నాడు. స్నానం చేసి ఒకసారి అద్దంముక్కలో మొహం చూసుకున్నాడు. బూచాడిలా కనబడుతున్నాడు.

అయితే ఏమయింది. ఇక్కడ ఈ ఎడారిలో ఎవడు చూస్తాడు? ఇక్కడ ఎక్కడా మనిషనే వాడు కనపడడు. ఇక తనకు సోకు లెందుకు?

తనకోసం జయప్రద వస్తుందా ఏం? తనకు తానే సమాధానం చెప్పుకుని విరక్తిగా నవ్వుకుంటూ మంచం మీదికి చేరాడు.

ఆరోజు పొద్దున్నే నిద్ర లేచేసరికి నీరసంగా అనిపించింది. నోరంతా చేదుగా జ్వరం వచ్చినట్లుంది. దిగులుగా అనిపించింది. లేవాలి అనిపించలేదు. కానీ గొర్రెలకు మేత వేసి నీళ్ళు పెట్టాలి కదా అనుకుంటూ పైకి లేచి షెడ్డు బయటికి వచ్చాడు.

వళ్ళు తూలిపోతోంది. కానీ గొర్రెల మీద ప్రేమ ముందుకు నడిపించింది. ఇంతలో దుమ్ము లేపుకుంటూ వచ్చి ఆగింది సేటు కారు.

"ఏమోయ్ ఎంకటేస్ ఎలా వున్నావు" అంటూ దిగాడు సేటు. సేటుతో పాటూ తుమ్మ మొద్దులా వున్న ఒక ఆడది కూడా దిగింది. తెచ్చినవన్నీ కిందకి దించింది.

"ఇదిగో ఇది ఇంట్లో పని సరిగ్గా చెయ్యడం లేదు. చెప్పిన మాట వినడం లేదు. ఇంటికి పోతానని ఒకటే గొడవ చేస్తోంది. ఏజెంటు దగ్గర దీన్ని మూడు వందల దినారాలు పెట్టి కొన్నాను. మరి ఆ డబ్బు తిరిగి ఎవడు ఇస్తాడు?

అందుకే ఇక్కడ వుండి గొర్రెలు కాస్తుంది, నీకు సహాయం చేస్తుంది అని తీసుకొచ్చాను. నాలుగు నెలలు ఎడారిలో పని చేస్తే దీని కొవ్వు అణుగుతుంది. దారికొచ్చి మాట వింటుంది. ఇంతకాలం కష్టపడ్డావు. దీనికి పని చెప్పి నువ్వు కొంచెం రెస్ట్ తీసుకో. ఇది పారిపోకుండా చూడు. అయినా ఈ ఎడారిలో ఎటు వైపు పోతుంది? పోతే గొంతు ఎండి చస్తుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ ఆడది ఆఫ్రికా నుండి వచ్చినట్లుంది. నల్లగా నిగనిగలాడిపోతాంది. మనిషి ఎత్తుగా, బలంగా రాక్షసిలా వుంది. ఇది చెప్పిన మాట విని పని చేస్తాదా.. సందేహించాడు ఎంకటేసు.

ఆమె భాష వీనికి రాదు. ఇతడి భాష ఆమెకు అర్థం కాదు. నాల్రోజులు ఇద్దరూ శత్రువుల్లా గుర్రుమంటూ తిరిగారు.

ఏదైనా పనిచెప్తే తల ఎగరేసి కోపంగా చూసేది. భయపడి తనే తలొంచుకుని పోయేవాడు. దాన్ని తెచ్చి వదిలినందుకు సేటు మీద కోపం వచ్చింది.

వంట మాత్రం తనే చేసేది. పెట్టుకుని తింటూ మిగిలింది తినమని సైగ చేసేది. ఆఫ్రికా వంట కొత్తగా అనిపించినా తప్పదు కాబట్టి తినేవాడు. తిని ప్రపంచాన్ని పట్టించుకోకుండా ఆ రేకుల షెడ్డులోనే మరోమూల మంచమేసుకుని పడుకుని గుర్రు పెట్టి నిద్రపోయేది.

ఏది ఏమయినా ఒక మనిషి పరిసరాల్లో తిరుగుతోంది, తోడుగా ఉంది అన్న భావన కాస్త దిగులును దూరం చేసింది.

నెల రోజులు గడిచాయి. ఆ వాతావరణానికి, గొర్రెలకు ఆమె కాస్త అలవాటు పడింది. అప్పుడప్పుడూ అర్థంకాని భాషలో అతడితో మాట్లాడేది. అడ్డంగా నిలువుగా తలూపేవాడు. తనూ తన భాషలో ఏదో సమాధానం చెప్పేవాడు.

బిగ్గరగా నవ్వేది. ఆమె నవ్వుకు గొర్రెలు బెదిరిపోయి పరిగెత్తేవి.

పరిగెత్తే గొర్రెల వెంట పరుగులు తీసేవాడు. ఆమె కూడా వెనకే పరిగెత్తేది. గొర్రెలను ముద్దు చేసేది. మెత్తటి ఇసుకలో ఆటలు ఆడేది. ఆమె భాషలో పాటలు పాడేది.

మొదట్లో ఆ పాటలు కర్ణకఠోరంగా వినిపించి చెవులు మూసుకోవాలి అనిపించినా రోజులు గడిచే కొద్దీ అలవాటయ్యింది. ఆ పాటల్లోని ఆవేదన ఏదో మనసుకు తాకేది.

కాలం గడుస్తుంటే ఏదో తెలియని ఆనందం అతడిలో ప్రవేశించింది. ఇప్పుడు అతడిలో మార్పొచ్చింది. నూనె పెట్టుకుని జుట్టును శుభ్రంగా దువ్వుకుంటున్నాడు. ఉన్నంతలో మంచి బట్టలు వేసుకుంటున్నాడు.

ముఖంలో కళ వచ్చింది. జీవితంలో వెలుగు వచ్చింది. సైగలతో అడిగి ఆమె పేరు సోమాలి అని తెలుసుకున్నాడు.

విచిత్రం మొదట నల్లగా మొద్దులా కనపడిన ఆమె ఇప్పుడు అతడి కంటికి జయప్రదలా కనిపిస్తోంది.

ఒకరోజు ఆమె రేకుల షెడ్డు వెనక స్నానం చేస్తుండగా తేలు కుట్టింది. బాధను భరించలేక గావుకేకలు పెట్టింది. వంటికి టవలు చుట్టుకున్న ఆమెను మంచం మీద పడుకోబెట్టి సేటు తనకు ఇచ్చిన తేలు మందును వెతికి తెచ్చి వేసాడు.

కరిచిన చోట వేడినీళ్ళ కాపడం పెట్టి సేవలు చేసాడు. నొప్పితో విలవిల్లాడిపోతోంది సోమాలి. రాత్రంతా నిద్ర పోకుండా దిగులుగా అక్కడే కూచున్నాడు ఎంకటేసు. ఏం చెయ్యాలో తోచలేదు.

సోమాలి అదృష్టం బావుంది. మరుసటి రోజు పొద్దున్నే సేటు అటు వచ్చాడు. విషయం చెప్పగానే ఆయన సోమాలిని కారులో పట్టణానికి తీసుకెళ్ళి హాస్పిటల్లో చూపించాడు. గండం గడిచింది. సోమాలి కోలుకుంది.

రోజులు గడుస్తున్నాయి. గొర్రెలు పిల్లలు పెట్టాయి. మంద పెద్దదయింది. సేటు వ్యాపారం బాగా పెరిగింది. సేటు ఇద్దరికీ జీతం కూడా పెంచాడు. ఇప్పుడు ఎంకటేసుకు ఇంటికి పోవాలి అనే ధ్యాస తగ్గింది. సొమాలి తోడు, స్నేహం దొరకడంతో ఆ ఎడారి పూలతోటలా కనిపిస్తోంది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments